

ఆలయానికి విరాళం అందజేస్తున్న దాతలు

## ఆలయానికి విరాళాలు అందజేత

వెల్దండ, అక్టోబర్ 19 : మండలంలోని కొట్రలో నూతనంగా నిర్మిస్తున్న కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి పలువురు విరాళాలు అందజేశారు. గురువారం కొట్రకు చెందిన బాదేపల్లి సాయిలుగౌడ్ రూ.10 వేలు, తిర్మన్‌దాస్ మల్లయ్యగౌడ్ రూ.10 వేలు, కొమ్మగోని నర్సింహాగౌడ్ రూ.5 వేల చొప్పున విరాళాలను అందజేశారు. వీరిని ఆలయ కమిటీ నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజుగౌడ్, ఉడుతల వెంకటయ్యగౌడ్, అల్లాజీగౌడ్ , సాయిలుగౌడ్, నర్సింహగౌడ్, మడ్డి అంజయ్యగౌడ్, బాల్‌రాంగౌడ్, సాయిలుగౌడ్, మల్లేశ్‌గౌడ్, జంగయ్యగౌడ్ ఉన్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న సర్పంచ్ అంజీనాయక్

వెల్దండ, అక్టోబర్ 19 : సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని నారాయణపూర్ సర్పంచ్ అంజినాయక్ అన్నారు. మండలంలోని నారాయణపూర్‌కు చెందిన శ్రీశైలానికి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.57 వేలు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన చెక్కును సర్పంచ్ గురువారం బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేశ్, శంకర్, సంతోష్, సీతారాం, రమేశ్ తదితరులు ఉన్నారు.

## జాతీయ స్థాయి యోగా పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక

కల్వకుర్తి, అక్టోబర్ 19 : కరీంనగర్‌లో నిర్వహించిన యోగా పోటీల్లో కల్వకుర్తి జయప్రకాశ్‌నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/ కళాశాలకు చెందిన విద్యార్థులు జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన 6వ తరగతికి చెందిన చరణ్, 9వ తరగతికి చెందిన అఖిల్, అవినాశ్ అస్సాంలో నిర్వహించే జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొననున్నారని ప్రిన్సిపాల్ దానం చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పీడీ శంషీర్‌అలీ, పీఈటీ రాజేందర్, ఆర్‌సీవో వనజ తదితరులు అభినం దించారు.

## బీఆర్ఎస్ పథకాలు ఇంటింటికీ తీసుకెళ్తాం

చారకొండ, అక్టోబర్ 19 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ తీసుకెళ్తామని బీఆర్ఎస్ జిల్లా నాయకులు యాతం శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని రామచంద్రాపురంలో అచ్చంపేట బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గువ్వల బాలరాజుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం కేసీఆర్ గ్రామాలకు అధిక నిధులు కేటాయించి అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాలు పేదలకు ఎంతో ఉపయోగకరమని, అందుకే అచ్చంపేటలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజును మరోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రచారంలో సర్పంచులు నరేందర్‌రెడ్డి, ప్రశాంత్‌నాయక్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంతుక వెంకటేశ్, నాయకులు పశుల శ్రీను, తన్నీరు రామకృష్ణ, వెంకటయ్య, నాగేశ్, జూమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.



విప్ గువ్వల మద్దతుగా ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రోత్సవాలు

■ లలితత్రిపుర సుందరీదేవీగా వాసవీమాత

కల్వకుర్తి, అక్టోబర్ 19 : దసరా ఉత్సవాలను పురస్కరించుకొని కల్వకుర్తి నియోజకవర్గంలో జగన్మాతను తొమ్మిది రోజుల పాటు ఆరాదించే పండుగ దేవీ నవరాత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. దేవదేవిని శక్తి అలంకరణములతో అలంకరిస్తూ కొలుస్తున్నారు. నవరాత్రోత్సవాలలో భాగంగా గురువారం కల్వకుర్తి పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీమాత లలిత త్రిపుర సుందరీదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వాసవీ మాతను ఉదయాన్నే సుప్రభాతంలో మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలితా త్రిపుర సుందరీ దేవీగా అలంకరించిన అనంతరం అమ్మవారికి సామూహిక కంకుమార్చనలు చేశారు. భక్తిరస సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ రమేశ్ బాబు, ఉత్సవ కమిటీ బృందం రమేశ్, శ్రీధర్, అశోక్, రఘు, శ్రీనివాస్, కోటేశ్, శేఖర్, పాపిశెట్టి శ్రీనివాసులు, శివాలయం శ్రీనివాస్‌తోపాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్థసారథి థియేటర్ వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారి మండపంలో అమ్మవారికి అభిషేకం చేశారు. పూజలు నిర్వహించి వడిబియ్యం పోశారు. కార్యక్రమాల్లో నిర్వాహకులతోపాటు మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



చారకొండలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

### మహాచండీ అలంకరణలో అమ్మవారు

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 19 : కల్వకుర్తి మండలంలోని మార్చాల, తర్నికల్, కుర్మిద్ద, జీడిపల్లి, గుండూర్, లింగసానిపల్లి గ్రామాలతోపాటు కల్వకుర్తి పట్టణంలోని పెద్దమ్మ తల్లి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి మండపాల వద్ద దేవీ శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారు మహాచండిమాత అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

### లలిత త్రిపుసుందరి అలంకరణలో..

వెల్దండ, అక్టోబర్ 19 : మండల కేంద్రంలోని బుధార్‌పేట ఆంజనేయస్వామి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొలువుదీరిన అమ్మవారు లలిత త్రిపుర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపతిరెడ్డి, విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, రవీందర్‌రావు సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో అమ్మవారు శరన్నావరాత్రి ఉత్సవాల సందర్భంగా కొలువుదీరిన అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, వజ్రలింగం, పూరి రమేశ్, బికుమండ్ల శ్రీను, కుమారస్వామి, పాలాది సంతోష్, సైదులు, కిరణ్, ఆంజనేయులు, రాజయ్య, అనిల్‌తోపాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో పూజలు

చారకొండ, అక్టోబర్ 19 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి మండపం వద్ద మహిళలు కోలాటాలు, బతుకమ్మ, ఆటపాటలు తదితర కార్యక్రమాలు చేశారు. అదేవిధంగా జూపల్లి, గోకారం తదితర గ్రామాల్లో అమ్మవారికి భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణతో వాసవీమాత



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మార్చాలలో పూజలందుకుంటున్న అమ్మవారు

# శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

■ డీఎస్పీ పార్థసారథి



చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ పార్థసారథి

చారకొండ, అక్టోబర్ 19 : మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రచారం చర్యలు తీసుకుంటామని, ఎన్నికల నియమావళిని పాటించాలని కల్వకుర్తి డీఎస్పీ పార్థసారథి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా తనిఖీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటరును ప్రలోభపెట్టే మద్యం, నగదు, వస్తువులపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. వాహనదారుల వద్ద ఏలాంటి ఆధారాలు లేకుండా రూ. 50 వేలు కంటే ఎక్కువ నగదు ఉంటే కేసు నమోదు చేసి సీజ్ చేస్తామని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించవద్దని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సందర్శించి రికార్డులు పరిశీలించి, పలు కేసులకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఎస్సై రవి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ఊర్కొండ, అక్టోబర్ 19 : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై లెనిక్ పేర్కొన్నారు. గురువారం ఆయన మండలంలోని ముచ్చర్లపల్లి గేటు సమీపంలో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్టు వద్ద తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తున్నామని, వాహనాల యజమానులు పోలీసులకు సహకరించాలని కోరారు. అదేవిధంగా రూ.50 వేలకంటే ఎక్కువ డబ్బులు ఉంటే వాటికి సంబంధించిన ఆధారాలు పక్కాగా ఉండాలని లేదంటే సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై లెనిన్

## నేడు విప్ గువ్వల ప్రచారం

వంగూరు, అక్టోబర్ 19 : ఎన్నికల ప్రచారంలో భాగంగా నేడు మండలంలోని కోనేటిపూర్, తిప్పారెడ్డిపల్లి, గాజర, నిజాంబాద్, ఉమ్మాపూర్, ఉప్పపహాడ్ గ్రామాల్లో విప్ గువ్వల బాలరాజు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున్న తరలిరావాలని కోరారు.

## చెంచులకు ఉచిత వైద్య శిబిరం

కొల్లాపూర్,అక్టోబర్ 19 :మండలంలోని మొలచింతపల్లి భ్రమరాంబ చెంచుకాలనీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు వైద్యశాఖ బృందం గురువారం చెంచులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది చెంచులు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం జ్వర పీడితులకు రక్త నమూనాలు సేకరించి దోమకాటు, జలుబు, దగ్గు ఉన్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సబ్ యూనిట్ ఆఫీసర్ రామ్మోహన్, కిశోర్, హెల్త్ అసిస్టెంట్ ప్రభాకర్, దివాకర్, ఉమాపతిరెడ్డి, ఆశ కార్యకర్త సరస్వతి ఉన్నారు.